
సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక సభ్యులు

## ఎస్సీ, ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ, వాటి ఉప కులాలకు విడివిడిగా ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఉప కులాలైన బేడ, బుడగ జంగాలు, డెక్కలి, బైండ్ల, మోచి, సమగర మోచి, చిందు, పంబల, మాస్టీన్, బ్యాగరి, మాదిగదాసు, దొంబర, మాదిగ జంగం, హోలియదాసరి వంటి 57 కులాల వారి బతుకులు ఏ ప్రభుత్వం మార్చలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి స్పందించిన సీఎం నాలుగు కార్పొరేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో ఆల్ ఇండియా బేడ, బుడగ జంగల ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ చింతల యాదగిరి, ఎస్సీ ఉప కులాల అధ్యక్షుడు డా.చంద్రగిరి, రాజమౌళి, ప్రధాన కార్యదర్శి మంగేష్, సభ్యులు యాదయ్య, రాజ్ దశరథ్, నూనె రాజు, లాలయ్య, శంకర్, తిరుమల హరి, ముత్యాలు, శ్రీధర్ గాంధీ, గణేష్, రాములు, నరసింహ, శ్రీనివాస్, రమేష్, విఠల్, 57 ఉపకులాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి

## కాంగ్రెస్, బీజేపీలకు ప్రజా సమస్యలు పట్టవు

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి కుర్చీ కోసం రాజకీయాలు చేసే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన సోమవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజాసంక్షేమం, వారి భవిష్యత్ కోసం నిత్యం బీఆర్ఎస్ పాటు పడుతుందన్నారు. వ్యాపారాలు చేసుకొనే బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ప్రజల సమస్యలు పట్టవన్నారు. లక్ష్మారెడ్డి లాంటి నాయకుడిని ఎంపీగా గెలిపించాలని సూచించారు. సమావేశంలో సంపత్ మాధవరెడ్డి, సిద్ధిరాములు, సుధాకర్‌గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య, గుమ్మడి మధుసూదన్‌రాజు, నార్లకంటి నగేష్, కాలే నగేష్, గణేష్, జ్ఞానేశ్వర్, విజయ్ హరీష్, నదీంరాయ్, రాముడుయాదవ్, మహిళ నాయకురాలు అరుణ, ఇంద్రారెడ్డి, పద్మ, కల్పనా, శ్రీదేవిరెడ్డి, శ్యామల పాల్గొన్నారు.

# లక్ష ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ విజయం తథ్యం

**కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్**


పద్మారావును కలిసిన పట్నం మహేందర్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు

**బాలానగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):** మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పట్నం సునీత మహేందర్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. బాలానగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం తుక్కుగూడలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆవిష్కరించిన మేనిఫెస్టో మహిళలను ఎంతో ఆకట్టుకుందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. సునీత మహేందర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలందరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం సునీత మహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్ రెడ్డి మాట్లాడుతూ.. తన తల్లి సునీతామహేందర్‌రెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులన్నీ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ● పద్మారావును కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మాజీమంత్రి

**బాలానగర్/వివేకానందనగర్‌కాలనీ:** కూకట్‌పల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల పద్మారావును మాజీమంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం ఆయన నివాసంలో కలిసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గొట్టిముక్కల పద్మారావును పార్టీలోకి ఆహ్వానించాలని సీఎం సూచనల మేరకు మహేందర్‌రెడ్డి పద్మారావుతో రెండు గంటల పాటు చర్చలు జరిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పద్మారావు త్వరలో సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి, దినేష్‌కుమార్, శేరిస తీష్‌రెడ్డి, రాంబాబు, జగన్, శివ, మహేందర్‌రెడ్డి వెంట ఉన్నారు.

### ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గాంధీ

**మియాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అందరూ కలిసి సోదరభావంతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాలు

**నిజాంపేట్:** బెస్ రన్నర్స్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించారు. పాఠశాలకు అవసరమైన గోడల నిర్మాణం, తలుపులు, గదుల ఫ్లోరింగ్ ఇతర సామగ్రిని సమకూర్చారు. ఈ విరాళం అందజేసిన వారిలో శ్రీనివాస్, రమేష్, శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు పద్మజ ఉన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

**పేట్‌బషీరాబాద్:** ప్రజలందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్ 9వ వార్డులో అమావాస్య సందర్భంగా సాయిబాబా ఆలయంలో నిర్వహించిన హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో అపార్టుమెంట్స్, విల్లాస్‌లో ఉన్న వారు ఓటు వేసే విధంగా అందరూ కృషి చేయాలని కోరారు.


బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట డివిజన్ మదీనాగూడకు చెందిన శ్రీనుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.1.50 లక్షల విలువైన చెక్కును సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో శ్రీను కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నాయకులు మాధవరం రంగారావు, చంద్రకాంతరావు పాల్గొన్నారు.

### ● అసోసియేషన్ సభ్యులకు సన్మానం

కొండాపూర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కాలనీ ఏ బ్లాక్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. కాలనీ అభివృద్ధికి పాటుపడాలని, ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో శివకుమార్, విజయకుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, చంద్రమౌళి, వెంకటరమణ, రాము, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలి


పార్కు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

**నిజాంపేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):** అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతతో కూడిన పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 7వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ పార్కును 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీనాయక్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. పార్కు లెవలింగ్, ట్రాక్, పార్కు గేటు, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ప్లాంటేషన్‌ను నాణ్యతతో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ధన్‌రాజ్‌యాదవ్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాలా రోజుల నుంచి పార్కులో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, లేనిచో కాంట్రాక్ట్ లైసెన్స్ రద్దు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రావణ్, కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

# ఫతేనగర్‌లో అమావాస్య అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

**ఫతేనగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):** అన్ని దానాల్లో కెల్ల అన్నదానం గొప్పదని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. టీం 8 సోషల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫతేనగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా అమావాస్య రోజున ట్రస్టు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామయోగిగుప్తా, వీరేశంగుప్తా, నాగేశ్వర్‌రావు గుప్తా, సత్యం గుప్తా, వాసుగుప్తా, పుల్లయ్యగుప్తా, స్థానికులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి: నార్నె

**హైదర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-3లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులు పరిశీలించినట్టు తెలిపారు. త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ సంతులిత అభివృద్దే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేశ్వరరావు, శ్రీధర్, మోహన్‌రావు, రామకోటేశ్వరరావు, విజయ్‌భాస్కర్, విజయ్‌కృష్ణ, బ్రహ్మశేఖర్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

# ఉల్లాసాన్నిచ్చే వసంతకాలం

**ఉగాది కవి సమ్మేళనంలో ప్రొఫెసర్ త్రివేణి**

**చందానగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** వసంతకాలం మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్య త్రివేణి అన్నారు. చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్కిటెక్ సురేష్‌బాబు సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సత్యసాయితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శంకర్‌పల్లి, వికారాబాద్, సదాశివపేట్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉగాది అంటే రుతువులన్నింటిల్లోనూ శ్రేష్ఠమైనదన్నారు. సామ్రాట్ రామకృష్ణరావు, అవధాని ములుగు అంజయ్య, వెంకటరామశర్మ, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ సభ్యులు వెంకటేశ్వరరాజు, జనార్దన్, శ్రీనివాస్, మల్లేశ్, ఉమ, సత్యనారాయణ ఉన్నారు.


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొ.త్రివేణి

# పదోన్నతుల ఫైళ్లకు పచ్చజెండా!

- ● ఉగాది సందర్భంగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్లకు శుభవార్త చెప్పిన వీసీ
- ● రెండ్రోజుల్లో దరఖాస్తుల పరిశీలన ప్రారంభించాలని ఆదేశం

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):** క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని జేఎన్‌టీయూ ప్రొఫెసర్లకు వైస్ చాన్స్‌లర్ కె.నర్సింహారెడ్డి శుభవార్త చెప్పారు. యూనివర్సిటీలో అర్హులైన అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ద్వారా పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేస్తానన్నారు. ఈ మేరకు రెండ్రోజుల్లో దరఖాస్తుల పరిశీలన ప్రారంభించాలని రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావుకు సూచించారు. సోమవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లతో సమావేశమైన వీసీ మూడేళ్లుగా తాను చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక (బుక్‌లెట్)ను వారికి అందజేశారు. మౌలిక సదుపాయాల పరంగా ఇతర యూనివర్సిటీలతో పోల్చితే జేఎన్‌టీయూ మొదటి స్థానంలో ఉందని, ఆయా సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పదవీ విరమణ చేసిన శాశ్వత ఆచార్యుల స్థానంలో టీచింగ్ అసిస్టెంట్లను నియమించాలని కొందరు డైరెక్టర్లు వీసీని కోరగా, ఫ్యాకల్టీ కొరత అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వీసీ చెప్పారు.

### సమస్యలన్నీ పరిష్కరిస్తా..

విభాగాల వారీగా ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, తన పదవీకాలం పూర్తయ్యే (మే22)లోగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని వీసీ పేర్కొన్నారు. డైరెక్టర్లు లక్ష్యాలను నిర్దేశించుకొని పని చేయాలని సూచించారు. యూనివర్సిటీకి గతేడాది కంటే మెరుగైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని, క్యాంపస్ కళాశాలకు ఇండియా టుడే ర్యాంకింగ్స్ కోసం అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి త్వరితగతిన పంపాలని సూచించారు.

### 'కేసీఆర్.. రాజకీయ దిగజారుడు ప్రసంగాలు మానుకో..'

**వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):** మాజీ సీఎం కేసీఆర్ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి వెంకట్రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారం కోల్పోయిన కేసీఆర్ రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఏమి మాట్లాడుతున్నారో తెలియడంలేదన్నారు. చంద్రబాబుపై రాజకీయ దిగజారుడు ప్రసంగాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర ఎంతో కీలకమని, ఈ విషయం రాష్ట్ర ప్రజలతో పాటు ఆయనతో కలిసి పనిచేసిన కేసీఆర్‌కు కూడా తెలుసన్నారు. ఇప్పటి నుంచైనా రాజకీయాలను విలువలతో కొనసాగించాలని ఆయన సూచించారు.


వెంకట్రావ్

### రోడ్డు కోసం ఐడీపీఎల్ అధికారులతో ఎమ్మెల్యే చర్చలు

**బాలానగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యో):** బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్ ప్రజల కోసం సౌకర్యార్థం సొంత నిధులు ఖర్చు చేసి వేసిన రోడ్డును ఐడీపీఎల్ అధికారులు కంచె వేసి మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అసహనం వ్యక్తం చేశారు. కంచె విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఉదయం కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, బస్తీవాసులతో ఐడీపీఎల్ అధికారులను కలిసి బస్తీవాసుల అవస్థలను వివరించారు. కంచె ఏర్పాటు చేస్తే ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, ఫెన్సింగ్ ఏర్పాటును విరమించుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాంతారావు చేసిన విజ్ఞప్తిని ఉన్నతాధికారులకు వివరిస్తామని ఐడీపీఎల్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించినట్లు సమాచారం.

### నేడు సాయిదత్త గణపతి ఆలయంలో ఉగాది సంబరాలు

**రాయదుర్గం:** గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి 7 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందని భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# స్విమ్మింగ్‌ఫూల్‌లో పడి బాలిక మృతి



**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):** స్విమ్మింగ్ ఫూల్‌లో పడి ఓ బాలిక మృతి చెందింది. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఎస్ఎసీఎల్ సిందూ అపార్టుమెంట్స్-501లో నిఖిల్‌కుమార్ కుటుంబం నివాసం ఉంటుంది. నిఖిల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయన కుమార్తె ఆధ్యాని(8)కి పుట్టుకతో మాటలు సరిగ్గా రావు. ఆధ్యాని 2వ తరగతి చదువుతోంది. ఆదివారం సాయంత్రం తండ్రితో కలిసి బాలిక సిందూ అపార్టుమెంట్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న స్విమ్మింగ్‌ఫూల్‌కు వెళ్లారు. నిఖిల్‌కుమార్ దుస్తులు మార్చుకోవడానికి వెళ్లాడు. ఈలోగా బాలిక సిమ్మింగ్‌ఫూల్‌లో పడింది. నిఖిల్‌కుమార్ వచ్చేసరికి బాలిక కనిపించలేదు. దీంతో ఆమె కోసం చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. కొద్దిసేపటికి స్విమ్మింగ్‌ఫూల్‌లో ఉన్న బాలికను గమనించిన నిఖిల్‌కుమార్ మరో ఇద్దరితో కలిసి ఆధ్యానిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. చిన్నారి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.


ఆధ్యాని (ఫైల్)

# డ్రగ్స్ సరఫరా చేస్తున్న నలుగురి అరెస్ట్


నిందితులతో జిల్లా ఎక్సైజ్ అధికారులు

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):** డ్రగ్స్ సరఫరా చేస్తున్న నలుగురు నిందితులను మేడ్చల్ ఎక్సైజ్ టాక్స్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి 5 గ్రాముల ఎండీఎంఏ అనే మత్తు పదార్థం, 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ జిల్లా అధికారి షేక్ ఫయాజుద్దీన్ నిందితుల వివరాలు వెల్లడించారు. అంబర్‌పేట ఆకాశ్‌నగర్‌కు చెందిన సయ్యద్‌ఫైజల్(26) షేక్‌గౌస్(31) కలిసి గోవా నుంచి హైదరాబాద్‌కు 5 గ్రాముల ఎండీఎంఏ తీసుకొస్తుండగా బోయినపల్లి చెరువుకట్ట తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరిని విచారించగా గోవాలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. అదే విధంగా బోయినపల్లికి చెందిన లవ్‌ప్రీత్‌సింగ్(26) పురాణ పుల్‌కు చెందిన సోమరాజు సింగ్(36) కలిసి ద్విచక్రవాహనంపై 290 గ్రాముల ఎండు గంజాయిని తీసుకెళ్తుండగా అస్మత్‌పేట వద్ద పోలీసులకు చిక్కారు. వీరి నుంచి రెండు సెల్ ఫోన్‌లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎక్సైజ్ అధికారి మాధవయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.